క్లుప్తంగా

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. మునగపాక బైపాస్ రోడ్డులో రూ. 5 కోట్లతో ఆలయ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన పెంటకోట త్రినాథరావు(టాటా, రత్నం దంపతులు గురువారం రూ.10,116 విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పెంటకోట ఉమేష్, వెలగా శ్రీనివాసరావు, కోనపల్లి రామ్మోహన రావు, ఆడారి లక్ష్మణరావు, వేగి శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మునగపాక: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ హాలులో జరిగే సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ప్రజా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొనాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయిబాబా ఆరాధన



తిమ్మరాజుపేటలో నగర సంకీర్తనలో భక్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం సత్యసాయి బాబా ఆరాధన దినోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం గ్రామంలో నగర సంకీర్తనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య గీతాలాపనలు, నారాయణ సేవతో పాటు నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సత్యసాయిబాబా భజన మండలి కన్వీనర్ సరిసా శివగణేష్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న గ్రామ పెద్దలు

అచ్యుతాపురం రూరల్: మరిడిమాంబ యూత్ ఆధ్వర్యంలో ఉప్పవరం గ్రామంలో మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువ జాము నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, చిన్ని సత్యారావు, అడపా మహాలక్ష్మినాయుడు, చిన్ని దొరబాబు, చిన్ని ధనుంజయరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్టుకొమ్మలు, మరమ్మతులు వల్ల శుక్రవారం పలు గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం రూరల్ ఫీడర్ పరిధిలో ఎస్.రాయవరం, సైతారుపేట, సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, వెంకటాపురం, కర్రివానిపాలెం, లింగరాజుపాలెం, పేటసూదిపురం, జేవీపాలెం, బసవపాడు, వాకపాడు, పెదఉప్పలం గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు దరఖాస్తులు

అచ్యుతాపురం రూరల్: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో 6 సంవత్సరాల ఇంటిగ్రేటడ్ బీటెక్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి సీఆర్టీ దేవరాయల్ గురువారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా www.rguktn.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి మే 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో నూజివీడు, ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ), ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాలు ఉన్నాయన్నారు.

తోటాడ రోడ్డు విస్తరణ కలేనా..?

నిత్యం వందలాది ప్రయాణికుల రాకపోకలు

ఇరుకు రోడ్డుతో అవస్థలు

ఒకవైపు మలుపులు.. మరో వైపు ట్రాఫిక్



విస్తరణకు నోచుకోని తోటాడ రోడ్డు ఇదే

మునగపాక: నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగించే తోటాడ రోడ్డు విస్తరణకు నోచుకోవడం లేదు. చదువుకునే విద్యార్థులు, వ్యాపారాలు చేసుకునే వారు, ఉద్యోగాలు చేసే వారు రోజూ ఈ మార్గం గుండానే ప్రయాణం సాగించాల్సి ఉంది. అటు అనకాపల్లికి, ఇటు పరవాడ, మండల కేంద్రమైన మునగపాకకు వెళ్లేందుకు ఈ రోడ్డు అనువుగా ఉంది. అయితే ఇరుకుగా ఉన్న రోడ్డు కావడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. రోడ్డు విస్తరణ చేస్తామంటూ నేతలు హామీలు ఇస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు.

తోటాడ మార్గంలో ప్రయాణం నరకం...

అనకాపల్లి జాతీయ రహదారి నుంచి పరవాడ, మునగపాక వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు తోటాడ రోడ్డు అనువుగా ఉండేది. నిత్యం ఈ రోడ్డులో పరవాడలోని పలు పరిశ్రమలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర బస్సుల ద్వారా రాకపోకలు జరుగుతుంటాయి. ప్రస్తుతం ఉన్న ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారి విస్తరణే శరణ్యమంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అసలే ఇరుకు రోడ్డు ఆ పై మలుపులు....

అసలే తోటాడ రోడ్డు ప్రస్తుతం ఇరుకుగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం 15 అడుగులకు మించి లేదు రోడ్డు. ఈ రోడ్డులో మలుపులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు మలుపుల వద్ద కనిపించకపోవడంతో ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే రహదారిని విస్తరిస్తామంటూ ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. అధికారులు రహదారి విస్తరణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



ఇరుకుగా ఉన్న బ్రిడ్జిపై నుంచే రాకపోకలు

ఇరుకు బ్రిడ్జితో నిత్యం అవస్థల మధ్య రాకపోకలు...

తోటాడ శివారు గవర్ల అనకాపల్లి వద్ద అనకాపల్లి ఆవ కాలువపై గతంలో నిర్మించిన బ్రిడ్జిపైనే రాకపోకలు సాగించాల్సి ఉంది. ఈ బ్రిడ్జి మీదుగా వచ్చే వారు ఇరుకు రోడ్డు కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో శుభ కార్యక్రమాలు జరిగే సందర్భాల్లో బ్రిడ్జికి రెండు వైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. రహదారి పొడవునా వాహనాలు నిలిచిపోయిన సంఘటనలు లేకపోలేదు. గతంలో పాత బ్రిడ్జికి సమాంతరంగా కొత్తగా బ్రిడ్జి నిర్మించినా రైతులకు ఇవ్వాల్సిన నగదు ఇవ్వకపోవడంతో నేడు నిరుపయోగంగా మారింది.

ప్రయాణం నరకం



తోటాడ మార్గంలో ప్రయాణం నరకంగా ఉంటుంది. నిత్యం వందలాది వాహనాల రాకపోకల కారణంగా నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రహదారి విస్తరణ చేయాల్సి ఉంది. అధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టి సారించి రహదారి విస్తరణ జరిగేలా చూడాలి.

– ఇల్లా నాగేశ్వరరావు, ద్విచక్ర వాహనదారుడు, కాకరాపల్లి

ఇరుకుగా రోడ్డు



అనకాపల్లి జాతీయ రహదారి నుంచి పరవాడ వరకు వెళ్లే రోడ్డు ప్రస్తుతం ఇరుకుగా ఉంది. ఈరోడ్డుపై రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో పలు గ్రామాల ప్రజలు పలు వాహనాలపై ప్రయాణం సాగిస్తున్నారు. తోటాడ రోడ్డును ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– మద్దాల ధనలక్ష్మి, సర్పంచ్, టి.సిరసపల్లి

ప్రతిపాదనలు పంపించాం

తోటాడ రోడ్డు విస్తరణకు ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తోటాడ నుంచి పరవాడకు వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉంది.ఈ రోడ్డు విస్తరణ ద్వారా సమస్య పరిష్కారం కానుంది.

– పద్మిని, ఆర్అండ్‌బీ జేఈ

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థిని మహిషా మహలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: లక్ష్యంతో కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో తోటాడ హైస్కూల్‌లో అత్యధిక మార్కులు సాధించిన బొడ్డేడ మహిషా మహలక్ష్మితో పాటు మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ చదువులో ఏకాగ్రత చూపించాలన్నారు. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. హెచ్ఎం సోమయాజులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, పెద్దలు దొడ్డి రమేష్, గొన్నాబత్తుల కుమార్, బొడ్డేడ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు రెడ్డి నాయుడు, పైలా రాము, నానాజీ, దివాకర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



నిందితులతో పోలీసులు

ఎస్.రాయవరం: వమ్మవరం శివారులో పేకాడుతుండగా ఐదుగురు పట్టుబడినట్టు ఎస్ఐ విభీషణ రావు తెలిపారు. స్థానికులు సమాచారం మేరకు గురువారం తమ సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,200 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పట్టవా?



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం: కొత్త రేవుపోలవరం గ్రామ శివారులో ఉపాధి హామీ పనుల వద్ద కల్పించిన సదుపాయాలను వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరిపిల్లి జగన్నాథం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులకు నెలలు తరబడి వేతనాలు చెల్లించలేదన్నారు. మండుటెండలో పని చేసే కూలీలకు టెంట్లు, తాగునీటి సదుపాయం కల్పించలేదని ఆగ్రహించారు. దూర ప్రాంతానికి వెళ్లి పని చేసినవారికి రవాణా ఖర్చులు చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం చేతకాని పాలన వల్ల వేతనదారులకు కష్టాలు వచ్చాయన్నారు. మరలా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, జగనన్న అన్ని వర్గాల వారిని ఆదుకుంటారని హామీ ఇచ్చారు. అనంతరం కూలీలకు కూల్ డ్రింక్‌లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు ఎరిపల్లి దేవుడు, చేపల నరహరి కృష్ణ, చెల్లూరి జగన్, మైపల్లి అప్పలరాజు, కాశి, కారే ముసిలి, దుర్గా నూకరాజు, చెల్లూరి నూకరాజు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవత పండగలు



రాజుపేటలో కొత్త మహలక్ష్మిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



వెంకటాపురంలో దుర్గాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని రాజుపేట, వెంకటాపురం గ్రామాల్లో గురువారం గ్రామదేవతల పండగలు ఘనంగా జరిగాయి. రాజుపేటలో కొత్త మహలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఉప సర్పంచ్ బూసా రాము, దళాయి పాపారావు, కర్రి రాము, అయ్యప్ప, కంబవు రాము, దుబాసి నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వెంకటాపురంలో దుర్గాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీ సర్పంచ్ కనకప్పారావు, ఎంపీటీసీ మద్దాల వీరు నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బాల్య వివాహాల నివారణ లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్ర స్థాయి కార్యకర్త రమ్య

మునగపాక: బాలికలపై వేధింపులతోపాటు, బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్ర స్థాయి కార్యకర్త కేఎల్‌వీ రమ్య కోరారు. మండలంలోని పాటిపల్లి, నారాయుడుపాలెం గ్రామాల్లో గురువారం ఆమె బాలల సంరక్షణకు సంబంధించి 11 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టాలు గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. సర్పంచ్‌లు ఆడారి కృష్ణవేణి, కోరుకొండ వెంకటి, పంచాయతీ కార్యదర్శులు రాజబాబు, కేటీ రావు, వీఆర్వో సింహాచలం, ఏఎన్ఎం సుజాత, మహిళా పోలీసు ఎస్‌కేఎం బేగం పాల్గొన్నారు.

ఎండలకు ప్రజల ఉక్కిరిబిక్కిరి



బోసిపోయిన కోటవురట్ల మెయిన్‌రోడ్డు

కోటవురట్ల: భానుడు ఉగ్రరూపం చూపిస్తున్నాడు. భగభగ మండిపోతున్న ఎండలతో మండల వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తీవ్ర వడగాల్పులు వీస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. వారం రోజులుగా సూరీడు రెచ్చిపోతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే సుర్రుమనిపించి వాతావరణం వేడెక్కుతోంది. పెరిగిన ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవ్వడంతో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఎండ తీవ్రతకు జనాలు ఇళ్లకే పరిమితమవ్వడంతో రహదారులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



ఆలయ సూపరింటెండెంట్‌కు నగదు అందిస్తున్న దాత పైడితల్లి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం అడవివరానికి చెందిన లోగిశ వరాహనరసింహం, పైడితల్లి దంపతులు లక్షా ఒక్క రూపాయి విరాళమిచ్చారు. ఉదయం ఆలయానికి వచ్చిన పైడితల్లి సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులకు అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్ పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం కోసం కృషి చేయాలి



పంచాయతీ రాజ్ దినోత్సవంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు



ఉప సర్పంచ్ జగతా భవాని ఆధ్వర్యంలో...



నక్కపల్లిలో గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం



తిమ్మాపురం మిఠాయిలు పంచుతున్న సర్పంచ్ సత్యనారాయణ

మునగపాక: ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం కృషి చేయాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పాటుపడాలన్నారు. ఎంపీడీవో ఎం. ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూటమి నేతలు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, కాళ్ల చంద్రమోహన్, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, హౌసింగ్ ఏఈ రాము, సూపరింటెండెంట్ ప్రసాద్, ఈవోఆర్డీ సోమరాజు, ఎంఈవో వేణుగోపాలరావు, ఏవో జ్యోత్స్నకుమారి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పాయకరావుపేట: పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా పాయకరావుపేట మేజర్ పంచాయతీలో ఉప సర్పంచ్ జగతా భవాని ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. పంచాయతీ రాజ్ దినోత్సవం ప్రాముఖ్యత, పంచాయతీ విధి విధానాలను ఈవోపీఆర్డీ సిహెచ్ చంద్రశేఖరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో జగతా శ్రీను, వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, నారపరెడ్డి పద్మావతి, పిరాది రాజు, పంచాయతీ కార్యదర్శి అప్పల శివరాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో పంచాయతీరాజ్ సంస్థలు కీలకం

నక్కపల్లి: దేశాభివృద్ధిలో స్థానిక సంస్థలు ఎంతో కీలకమని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం అమలులో భాగంగా ఏర్పాటైన పంచాయతీ రాజ్ సంస్థలు ప్రస్తుత సమాజంలో కీలక భూమిక పోషిస్తున్నాయని ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గాంధీజీ, అంబేడ్కర్, నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సంస్థలకు కల్పించిన అధికారాలు, విధులు, నిధుల కేటాయింపు ద్వారానే నేడు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలుగుతున్నామన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు అన్ని సామాజిక వర్గాల వారికి రిజర్వేషన్ సదుపాయం కల్పించడం గొప్ప విషయమన్నారు. స్థానిక సంస్థలకు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. అభివృద్ధిలో పోటీపడి పురోగతి సాధిస్తున్న పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నజరానా ప్రకటిస్తున్నాయన్నారు. ఈ నిధులను ఉపయోగించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవాలన్నారు. మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: పంచాయతీలు అభివృద్ధి చెందినప్పుడే అన్ని సమస్యలు పరిష్కరించబడతాయని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, సర్పంచ్ కర్రి సత్యనారాయణ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం పురస్కరించుకుని తిమ్మాపురంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఎస్.రాయవరం, పెదగుమ్ములూరు, సర్వసిద్ధి తదితర పంచాయతీల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లింపుల్లో అన్యాయం

నిర్వాసితుల తరపున వైఎస్సార్ సీపీ పోరాటం



రాజయ్యపేటలో నిర్వాసితులతో కలిసి మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహమూర్తి

నక్కపల్లి: ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం ద్రోహం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి విమర్శించారు. గురువారం ఆయన ఏపీఐఐసీ వారు భూములు సేకరించిన గ్రామాల్లో రైతులు, నిర్వాసితులు, మత్స్యకారులతో కలసి పర్యటించారు. ఏపీఐఐసీ వారు చేపట్టిన పనులు పరిశీలించారు. నష్టపరిహారం చెల్లింపుల్లో ప్రభుత్వ తీరును బాధిత రైతులు మొరపెట్టుకున్నారు. నష్టపరిహారం చెల్లించకుండా భూముల్లో పనులు ప్రారంభించారని, అడ్డుకుంటే పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాజయ్యపేట, డీఎల్‌పురం, వేంపాడు, చందనాడ, అమలాపురం తదితర గ్రామాల్లో భూములు సేకరించిందన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని ఇచ్చిన హామీని విస్మరించి రైతులను మోసం చేసిందన్నారు. తాజాగా సుప్రీం కోర్టు తీర్పును కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. ఈ గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం కాదన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే కంపెనీల్లో నిర్వాసితులకు, చేతి వృత్తులవారికి, ఈ ప్రాంత యువతకు ఉద్యోగాల కల్పించాలన్నారు. అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు తక్షణమే నక్కపల్లిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ఏర్పాటు చేయాలన్నారు. నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఐదు సెంట్ల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.15 లక్షలు, మేజర్లకు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పోలీసు కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. తక్షణమే నష్టపరిహారం చెల్లింపులను పూర్తి చేయాలని, డీఫారం, సాగుదారులకు పరిహారం చెల్లించకపోతే వైఎస్సార్ సీపీ తరపున ఆందోళన ప్రారంభిస్తామన్నారు. చినతీనార్ల సర్పంచ్ ముసలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎరిపల్లి నాగేశు, కొర్లయ్య, అప్పలరాజు, పైడితల్లి, నూకరాజు పిక్కి రాము తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీతో కన్నీటి నివాళి



కోటవురట్లలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న నాయకులు

కోటవురట్ల: ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మశాంతిని కోరుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో జనసేన పార్టీ స్టేట్ సెక్రటరీ బోడపాటి శివదత్ ఆధ్వర్యంలో మృతులకు నివాళి అర్పించారు. అనంతరం కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు, నాయకులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com